
కానీ తప్పదు శ్రీవారు నాలో మార్పు గమనించారేమో. మందహాసంతో నా భుజం తట్టారు. ఇల్లు చేరి అమ్మవారి పటం ముందు అష్టోత్తరం చదువుతున్న నాకు అమ్మవారి చూపు మన్నించినట్లు తోచింది. ఇంతలో సాంబయ్య కొబ్బరికాయల కేక ఈసారి నేను ఉలిక్కిపడలేదు. ఏదో మహత్కార్యం చేసిన ఫీలింగ్.

అతనికోసమే ఎదురుచూస్తున్నట్లుగా గబగబా వెళ్ళి సాంబయ్యను ఇంట్లోకి పిలిచాను. "సాంబయ్యా, ఈరోజు మావారి పుట్టినరోజు. అన్నం, కూరలు సర్ది ఉంచాను. నీకు ఇవ్వాలనిపించింది. ఇంటికి తీసుకెళ్ళి నీ భార్య, పిల్లలకు పెట్టు" అంటూ అతనికి అందించాను. అవి నా పాప పరిహారార్థం ఇస్తున్నవని తెలియక మా తల్లి, మా లచ్చుమ్మ తల్లి అంటూ ప్రసాదంలా కళ్ళకద్దుకున్నాడు. పాపాన్ని పరిహారం చేసుకోకపోయినా ఒక మంచి పని చేసిన తృప్తి మిగిలింది. శ్రీవారు నా చెయ్యి నొక్కి వదిలారు. అది అభినందన తాలూకు స్పర్శ అని అర్థం అయింది.

-జి.పద్మజ (మాచర్ల)

# బిజినెస్

"ఏమ్‌రా? అనుకున్న టైంకి పని జరిగిపోవాలని జెప్పినా గదరా! పని వదిలేసి పరాచికాలాడుకుంటున్నార్రా? ఆ యాద్గిరి, మల్లేష్ ఆళ్ళ గ్యాంగు యాడికి బోయినార్రా? ముందు అర్జంటుగా నా రూమ్ కొచ్చి నన్ను గల్వమని జెప్పు. మొత్తం అయిదు గల్లీల్లో టెంట్‌లు ఏసిర్రు. నా దగ్గరకొచ్చినంక స్పాట్ జెప్పి అడ్వాన్సు ఇచ్చి బంపుతా. అవతల పార్టీకి మాటిచ్చినం. మాటబోగూడదు మల్ల. మాటబోతే మనుగడుండదురా పేనం బోయినట్టే లెక్క. ఏం అర్థమయినాదిరా?" అంటూ ఆవేశంతో ఫోన్ ఆఫ్ చేసి బైక్ స్టార్ట్ చేసుకుని రూమ్ కొచ్చేశాడు వీరేశం.




కరెక్టుగా పదే పది నిమిషాల్లో యాదగిరి, మల్లేష్ వాళ్ళగ్యాంగ్‌తో సహా అక్కడ ప్రత్యక్షమయిపోయారు. కోపంలో రగిలిపోతున్న వీరేశం ముఖంలోకి చూడలేక తలలు వంచుకుని నిల్చున్నారు వాళ్ళంతా.

"ఏమ్‌రా యాద్గిరి చెప్పిన టైం మరిచిపోయినార్రా? పోనీ మీ పైసలెప్పుడన్నా ఇయ్యకున్నానా. పని పూర్తికాగానే అందరికీ పైసలు ముట్టజెప్తున్న గదరా" కోపంగా ప్రశ్నించాడు వీరేశం.

ఎవరూ బదులివ్వలేదు. రెండు నిమిషాలు ఆలోచించి, ఆవేశం పాళ్ళు కొంచెం తగ్గించి అక్కడి మౌనాన్ని భగ్నం చేస్తూ, సముదాయిస్తున్న రీతిలో "అయ్యిందేదో బోనీ గిప్పుడు జెప్తున్న ఇగ్గో తలో పది అడ్వాన్సు. పూర్తయినంక మిగతాయిస్త" అంటూ తలో పది చొప్పున అడ్వాన్సుగా ఇచ్చేశాడు వీరేశం.

వీరేశం ఇచ్చిన అడ్వాన్సు పుచ్చుకొని ఇంకా అక్కడే మౌనంగా నిలబడున్నారు యాద్గిరి ఆది గ్యాంగ్.

"ఏమ్‌రా? ఇంకా ఇక్కడే వున్నారు. బయలుదేరుండ్రి" ఆర్డరేశాడు వీరేశం.

మల్లేష్ మెల్లగా గొంతు సవరించుకుని, కొంచెం ధైర్యం చేసి అన్నాడు "స్పాట్ ఎక్కడో జెప్పుతానన్నవ్ గన్నా"

"అరె అసలిషయం యాది లేదు. తూర్పు ఈధిలోకి మువ్వు, దక్షిణ ఈధిలోకి నువ్వు చైతన్య స్కూల్ పక్కన నువ్వు, హిమగార్డెన్స్ ఫంక్షన్ హాల్ దగ్గర నువ్వు" అంటూ తలో స్పాట్ చెప్పేశాడు వీరేశం.

అయిదే అయిదు నిమిషాల్లో అక్కడ్నుంచి మాయమయిపోయారు. వీరేశం టెన్షన్ టెన్షన్‌గా అక్కడే అటూ ఇటూ తిరుగుతున్నారు.

"హ..కనక్ కనక్ కనక్.." వెరైటీగా క్రూరమైన స్వరంతో రింగవుతోంది. వీరేశం జేబులో వున్న సెల్ ఫోన్.

వీరేశం జేబులో వున్న సెల్‌ఫోన్ బయటకు తీసి నంబరు చూసి చిరాగ్గా మొఖం పెట్టి, ఆ క్రూర స్వరాన్ని ఆపేసి, చెవి దగ్గర పెట్టుకుని తన వీర స్వరంతో "హలో" అన్నాడు.

అటువైపునుండి వీరేశం కమిట్ అయిన 'పార్టీ' పని గురించి ఎంతవరకొచ్చిందంటూ అడుగుతున్నారు.

"అయిపోద్దన్నా! సాయంత్రం ఆరు గంటలకల్లా మీ దగ్గరుంట. ఈరేశం మాటిస్తే ఆరుమూరైనా నూరు ఆరైనా పని జరిగిపోద్దన్నా వుంటనన్నా" ఫోన్ ఆఫ్ చేసి మళ్ళీ జేబులో పెట్టేశాడు వీరేశం.

★ ★ ★

సాయంత్రం నాలుగ్గంటలకు యాదగిరి, మల్లేష్ ఆళ్ళగ్యాంగ్‌తో సహా వీరేశం ముందు నిలబడున్నారు.

"ఏమ్‌రా? యాద్గిరి ఎన్నిరా?" వీరేశం ప్రశ్నించాడు.

"ఎయ్యన్నా" బదులిచ్చాడు యాదగిరి.

"పొద్దుగాల పదిచ్చిన గిదుగో ఇంకో పది దీస్కోరా.." అలా మిగతా వాళ్ళకు కూడా వాళ్ళు చెప్పిన నంబర్లను బట్టి డబ్బిచ్చేసి మిగతా కార్యక్రమాలు ముగించే పనిలో పడ్డాడు వీరేశం.

★ ★ ★

కరెక్టుగా ఆరుగంటలకు "అన్నమాట దప్పడం ఈ ఈరేశం డిక్షనెరీలో లేదన్నా. చూశారుగా టైమంటే టైమే" అంటూ తాను రీప్యాక్ చేయించి తీసుకొచ్చిన యూజ్‌డ్ డిస్పోజల్ గ్లాసులు, టీ కప్పుల పార్శిల్స్ బైక్ మీది నుండి దింపి ఆ షాపువాళ్ళకు అదే 'పార్టీ'కి అందిస్తూ చెప్తున్నాడు వీరేశం.

అలా ఎక్కడ ఏ ఫంక్షన్లు జరుగుతున్నాయో ముందుగా ఆరాతీస్తూ, కొంతమంది పిల్లల్ని పోగేసుకుని, వాళ్ళకు పదో పరకో ముట్టజెప్తూ తాను చేసే చెత్త వ్యాపారంతోపాటు ఈ కొత్త వ్యాపారాన్ని కూడా ఆరు పువ్వులు ఆరవై ఆరు కాయలుగా జేసుకుంటున్నాడు వీరేశం.

-మాణిక్యాల శ్రీనివాసరావు (హైదరాబాద్)